నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ ఎలక్ట్రికల్ ఏఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గురువారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నిఖిల్ తెలిపారు. 11 కేవీ సీడీఎఫ్‌డీ ఫీడర్, చిలుకానగర్, ఘట్‌కేసర్, బోడుప్పల్, బ్యాంక్ కాలనీ, ఆదర్శ్‌నగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఉండని ప్రాంతాలు:
ఉప్పల్ పోలీస్ క్వార్టర్స్, డీఎంహెచ్‌వో, జీహెచ్‌ఎంసీ లేన్, సీడీఎఫ్‌డీ గణేష్‌నగర్, సెవన్ హిల్స్ కాలనీ, సాయిరాంనగర్, శ్రీనివాస్ హైట్స్, అపూరూప జగపతి హైట్స్, ఓల్డ్ భరత్‌నగర్ కాలనీ, న్యూభరత్‌నగర్ కాలనీ, కావేరి నగర్, ధర్మపురి కాలనీ మెయిన్ రోడ్డు, కుమ్మరి బస్తీ, ప్రశాంత్‌నగర్, ఆదర్శ్‌నగర్, బ్యాంక్ కాలనీ, ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..
బీరప్పగడ్డ, ధర్మపురి కాలనీ, ప్రశాంత్‌నగర్, రాఘవేంద్రనగర్, శ్రీగిరి కాలనీ, సాయిరాంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

బఫర్ జోన్‌లో నిర్మాణం నేలమట్టం



సాక్షి ఎఫెక్ట్..

ఉప్పల్ దేవేందర్‌నగర్ రోడ్డు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తూ..

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ మెట్రో స్టేషన్ దేవేందర్‌నగర్ కాలనీ రోడ్డులో నాలా పక్కన ఉన్న బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై జీహెచ్‌ఎంసీ అధికారులు కన్నెర్ర చేశారు. సాక్షి దిన పత్రికలో బుధవారం 'బఫర్ బేఫికర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించారు. బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని బుధవారం ఉదయమే టౌన్ ప్లానింగ్ సిబ్బంది నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను సహించేది లేదని, నిర్మాణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిర్మాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ అనుమతి వచ్చిన తర్వాతే నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి జాప్యం లేకుండా సులభంగా అనుమతులు ఇస్తున్నామని తెలిపారు.

శ్రీరాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



జెండాలను పంపిణీ చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ శ్రీరాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవించాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్‌లో అయోధ్య శ్రీరామ భవ్య మందిర అక్షింతల వితరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో 1366 గడపలకు అక్షింతలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అలాగే 500 జెండాలను ఇంటింటికీ పంపిణీ చేసినట్లు తెలిపారు. పబ్బా శివకుమార్, బేజాడి బ్రహ్మం, కానాపురం దివాకర్, సురేష్, పురుషోత్తం, బల్ల వినయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి



జెడ్సీతో కార్పొరేటర్ శాంతిరెడ్డి

మల్కాజిగిరి: అల్వాల్ డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కార్పొరేటర్ శాంతిరెడ్డి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు విజ్ఞప్తి చేశారు. సెయింట్ జేవియర్ పాఠశాల వద్ద బాక్స్ డ్రైన్ నిర్మాణం, పార్కులకు ఫెన్సింగ్, చిన్నరాయిని చెరువు, కొత్త చెరువు అభివృద్ధిపై దృష్టి సారించాలని జోనల్ కమిషనర్‌ను కోరామని కార్పొరేటర్ తెలిపారు. జెడ్సీని కలిసిన వారిలో మల్లేష్‌గౌడ్, వీఎన్ రాజు, అరుణ్ ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఏసూరి మాధవ్

మేడిపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన ఏసూరి మాధవ్(35) బుధవారం ఘట్‌కేసర్ ప్రాంతంలోని తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి సాయంత్రం తన ద్విచక్రవాహనంపై ఉప్పల్ వైపు వస్తుండగా మేడిపల్లి సీపీఆర్‌ఐ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు వెంటనే చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

బార్డర్ సమస్యతో స్థానికుల అవస్థలు



మల్లాపూర్: హనుమాన్‌నగర్, బాబానగర్ కాలనీ బార్డర్‌లో కొంత కాలంగా భూగర్భ డ్రైనేజీ పొంగి పారుతోంది. దీంతో కొంత కాలంగా ఈ సమస్యపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ సమస్య మీది.. అంటే మీదే అని అధికారులు తప్పించుకుని తిరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగు నీటిలో నడవలేని పరిస్థితి నెలకొందని, దీంతో రోగాలపాలవుతున్నామని, ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మేడ్చల్ పీఎస్‌ను సందర్శించిన సైబరాబాద్ సీపీ

మేడ్చల్‌రూరల్: సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి బుధవారం సాయంత్రం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సీపీ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పీఎస్‌లోని పలు రికార్డులను తనిఖీ చేసిన ఆయన క్రైంరేటు, కేసుల నమోదు వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ నర్సింహారెడ్డి పలు వివరాలను సీపీకి వివరించారు.

అభివృద్ధికి కేరాఫ్ పీర్జాదిగూడ

- అభివృద్ధి పథంలో పీర్జాదిగూడ కార్పొరేషన్
- మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధిలో పోటీ
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- పాలకవర్గం ఏర్పడి త్వరలో నాలుగేళ్లు పూర్తి



ఆధునిక హంగులతో వైకుంఠధామం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది. గడిచిన నాలుగేళ్లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించుకుంటూ మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధిలో పోటీపడుతోంది. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆధునిక వైకుంఠ ధామాలు, పార్కుల్లో పచ్చదనం పెంపొందించడంతోపాటు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు పలు దేశాలు, రాష్ట్రాల అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు వస్తున్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థను ఓ మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు ఒకవైపు అధికారులు, మరోవైపు ప్రజాప్రతినిధులు నిత్యం కృషి చేస్తున్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

మౌలిక వసతుల కల్పనకు రూ.65 కోట్లు..

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ 2019 జూలై 23వ తేదీన ఏర్పడింది. 2020 జనవరి 27వ తేదీన తొలి మేయర్‌గా జక్క వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. గడిచిన నాలుగేళ్లలో నగర పాలక సంస్థ నిధులు రూ.65 కోట్ల వ్యయంతో అనేక మౌలిక వసతులు కల్పించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న కాలనీ రోడ్లకు మధ్యలో డివైడర్లు నిర్మించి పచ్చదనాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో..

రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.115 కోట్ల వ్యయంతో రెండు రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. మొదటి విడతగా రూ.50 కోట్లతో 40లక్షల లీటర్ల కెపాసిటీ గల రిజర్వాయర్ నిర్మించారు. రెండో విడతగా రూ.65 కోట్లతో 90లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన మరో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా అన్ని కాలనీల్లో పైపులైన్ పనులు చేపట్టి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు.

రూ.26 కోట్లతో పర్వతాపూర్ రోడ్డు

రూ.26 కోట్లతో పీర్జాదిగూడ నుంచి పర్వతాపూర్ వరకు 4 లేన్ల బీటీ రోడ్డు పనులను చేపట్టారు. రోడ్డు మధ్య డివైడర్‌ను ఏర్పాటు చేసి మధ్యలో మొక్కలతోపాటు పచ్చదనం ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించారు. జరుగుతున్న పనులను త్వరితగతని పూర్తిచేసి వాహనదారులు, ప్రయాణికులకు వినియోగంలోకి తేనున్నారు.

రూ.16.50 కోట్లతో.. వైకుంఠధామాలు, చెరువు అభివృద్ధి

రూ.13 కోట్ల వ్యయంతో పీర్జాదిగూడ చెరువును మినీట్యాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేశారు. చెరువుకు రిటర్నింగ్ వాల్, బ్యూటిఫికేషన్, చిన్న పిల్లలకు ప్లే ఏరియా, ఓపెన్ ఎయిర్ జిమ్, వ్యూ పాయింట్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. రూ.3.50 కోట్లతో ఆధునిక హంగులతో మోడల్ వైకుంఠధామం నిర్మించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారికి ఒకే చోట ఏర్పాటు చేసి కర్మ కాండలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణం

రూ.7.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ శాఖహార, మాంసాహార మార్కెట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే ఎస్‌ఎన్‌డీపీ నిధులు రూ.15 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వాటర్ క్లోస్డ్ చానల్, మురికి కాల్వల నిర్మాణం పనులు చేపట్టారు. స్వచ్ఛ పీర్జాదిగూడలో భాగంగా పబ్లిక్ టాయిలెట్స్‌ను ఆధునిక హంగులతో నిర్మించారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. అధికారులు, పాలకవర్గ సభ్యుల సమన్వయంతో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శానిటేషన్ పనులు చేపడుతున్నాం. చెత్తరహిత నగరంగా ఉండే విధంగా సమీకృత శుద్ధీకరణ పనులు చేపట్టాం. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఉండేందుకు డోర్ టు డోర్‌కు దోమల మందు కొడుతున్నాం. 2 కిలో మీటర్లకు ఒక స్వీపర్‌ను పెట్టి నగర పాలక సంస్థ పరిశుభ్రంగా ఉండేందుకు అందరం కృషి చేస్తున్నాం.

– జక్క వెంకట్‌రెడ్డి, మేయర్ పీర్జాదిగూడ

విద్యుత్ మరమ్మతుల కారణంగా..

ఉప్పల్: హబ్సిగూడ సెక్షన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం రవీంద్రనగర్, హబ్సిగూడ వీధి నంబర్–8 ఫీడర్ల పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాంరెడ్డి తెలిపారు. రవీంద్రనగర్, జేఎస్ఎన్ కాలనీ, సత్యనారాయణ స్వామి నగర్, మహేశ్వరీ నగర్, కాలనీలో కరెంటు ఉండదని తెలిపారు.

మల్కాజిగిరిలో...
మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ సంతోషిమానగర్ ఫీడర్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని ఏఈ శ్రీనివాసులు, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. చంద్రగిరికాలనీ, సంతోషిమానగర్ కాలనీ, వినాయకనగర్ బ్లాక్–3, డీమార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



బోడుప్పల్: వీర శైవ సమాజం కేలండర్‌ను బుధవారం బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ ఆవిష్కరించారు. ఈ కేలండర్‌లో ప్రజలకు ఉపయోగపడే సమగ్రమైన సమాచారం ఉందన్నారు. కార్యక్రమంలో వీర శైవ సమాజం అధ్యక్షుడు నాగేందర్ పాటిల్, ఉపాధ్యక్షుడు విజయకుమార్ శెట్టి, యువరాజు, జమ్మ సురేష్ పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్ నిర్మాణంలోని భూసేకరణ వివరాలివ్వండి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఓఆర్‌ఆర్ నిర్మాణంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో చేపట్టిన భూసేకరణకు సంబంధించిన రికార్డులు ధరణిలో నమోదైందా లేదా అనే విషయాల్ని పరిశీలించి, ఆ వివరాలను వెంటనే సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట్, దుండిగల్, గండిమైసమ్మ మండలాల పరిధిలోని తహసీల్దార్లు, హెచ్‌ఎండీఏ ఇంజినీర్లు, సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో సేకరించిన భూమి అంతా ధరణిలో నమోదైందా లేదా అని పరిశీలించాలన్నారు. సేకరించిన భూమి వివరాలను పరిశీలించి, ఎక్కడైనా భూమి ఇంకా నమోదు కాకపోతే, అలాగే కోర్టులో పరిహారం నగదు డిపాజిట్ చేసినట్లయితే వివరాలు సమర్పించాలన్నారు. ధరణిలో నమోదు కాకపోతే సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

'డబుల్' పనులను త్వరగా పూర్తి చేయాలి

- అర్హులకు అందించేలా సౌకర్యాలు కల్పించాలి
- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తిచేసి, అర్హులైన లబ్ధిదారులకు అందజేసేలా.. సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో ప్రత్యేకంగా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

◆ జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన వారికి ఎన్ని అందజేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల పురోగతి ఎలా ఉంది..? ఏ స్థితిలో ఉన్నాయని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస మూర్తి, రెవెన్యూ డివిజన్ అధికారులను ఆయన అడిగారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు, మండల తహసీల్దార్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో బెటాలియన్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో సీబీఆర్‌ఎం మాక్ డ్రిల్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ దామోదర్ సింగ్, ఇన్‌స్పెక్టర్ గౌతమ్‌కుమార్, వారి బృందం బ్లాస్ట్, కెమికల్ లీకేజ్ జరిగినప్పుడు ఏవిధంగా తమకు తాముగా కాపాడుకోవాలి అన్న అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించి అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, మెడికల్ సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

జిల్లా జెండర్ స్పెషలిస్ట్ వాసవి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా జెండర్ స్పెషలిస్ట్ వాసవి అన్నారు. మహిళా సాధికారతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి సొంతంగా నిర్ణయాలు తీసుకొనే స్థాయికి ఎదగాలన్నారు. మహిళలపై జరిగే హింసల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇళ్లలో హింస, పని ప్రదేశాల్లో లైంగిక, శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు మహిళలు ఆందోళన చేయకుండా ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యలను చెప్పాలన్నారు. మహిళల కోసం హెల్ప్‌లైన్ 181, సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ముద్ర లోన్స్, స్టాండ్ అప్ ఇండియా స్కీం, గృహ హింస చట్టం, పోక్సో చట్టం, హెల్ప్ లైన్ నంబర్స్ 1098, 14567పై అవగాహన పెంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో శ్రావణితో సహా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

గిర్మాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్: మండలంలోని ఘనాపూర్ మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని గిర్మాపూర్ కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు.

మైనార్టీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉన్న 8 మైనార్టీ గురుకుల పాఠశాలలు అండ్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఖాసిం కోరారు. జిల్లాలో మేడ్చల్(బాలురు), మేడ్చల్(బాలికలు), కుత్బుల్లాపూర్(బాలురు), కుత్బుల్లాపూర్(బాలికలు), బాలానగర్(బాలురు), బాలానగర్(బాలికలు), మల్కాజిగిరి(బాలికలు), ఉప్పల్(బాలికలు) పాఠశాలలు అండ్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులు, 5వ తరగతిలో ప్రవేశాలు, 6, 7, 8వ తరగతిలో ఖాళీలను మాత్రమే భర్తీ చేస్తున్నామన్నారు. అర్హులైన మైనార్టీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి తమ దరఖాస్తులను ఫిబ్రవరి 6 వరకు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశం కోసం మైనార్టీస్ (ముస్లిమ్స్, క్రైస్తవులు, పార్సి, సిక్స్, జైన్స్, బుద్ధిస్ట్) విద్యార్థులకు 75 శాతం సీట్లతో పాటు నాన్ మైనార్టీలకు (ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరులకు) 25 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. ఆసక్తి కలిగి ఉన్నవారు గడువులోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలని వినతి

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో స్కూల్ భవనంపై సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలంటూ పలువురు స్థానికులు మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారికి గురువారం వినతి పత్రం అందజేశారు. సెల్ టవర్ సమీపంలో 900 మంది కేంద్రీయ విద్యాలయ స్కూల్ విద్యార్థులే కాకుండా, టవర్ నిర్మిస్తున్న భవనంలో కూడా 180 మంది విద్యార్థులతో ప్రైవేటు స్కూల్ నడిపిస్తున్నారని వినతిలో తెలిపారు. రమాదేవి, మల్లేశ్‌యాదవ్, నాగులు, శ్రావణి, ఉషా, విజయ్, రమేశ్, శ్రీను, మణి, ఫణీందర్, బాబు, వెంకటేశ్వర్లుయాదవ్, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో అయోధ్య రామయ్య అక్షింతలను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అయోధ్య రాములోరి అక్షింతలు, రామమందిర చిత్రపటం, కరపత్రం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, కుమార స్వామి, రామభక్తులు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తున్న వారిపై కేసు

ఘట్‌కేసర్: బాలకార్మికులతో పనిచేయిస్తున్న వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులు, ఘట్‌కేసర్ పోలీసులు సంయుక్తంగా పెట్రోల్ బంక్, వెల్డింగ్ షాప్, జనరల్ స్టోర్‌లో పనిచేస్తున్న ఏడుగురు బాల కార్మికులను పట్టుకున్నారు. వారితో పని చేస్తున్న యజమానులపై కేసు నమోదు చేశారు. అనంతరం బాలకార్మికులను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

మౌలాలిలో పర్యటించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మౌలాలిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అధికారులు

మౌలాలి: మౌలాలిలో ఈ నెల 24 నుంచి 31 వరకు నిర్వహించే ఉర్సు ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. మౌలాలి గుట్ట పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు, ఈఈ లక్ష్మణ్, టౌన్‌ప్లానింగ్ తుల్జాసింగ్, ఏఈ మధురిమ, ఎలక్ట్రికల్ వెంకటేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు అమీనుద్దీన్, బద్దం పరుశురాంరెడ్డి, నవాబ్, ఇబ్రహీం, సత్తయ్య, గణేష్, మహేష్, సందీప్, నర్సింగ్ రావు, ఆది, బాలకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

శానిటైజేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించండి



శానిటరీ అధికారులతో సమావేశం

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ శ్రవణ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. సర్కిల్ కార్యాలయంలో వారితో బుధవారం సమావేశం అయ్యారు. శానిటైజేషన్‌లో మోడల్ డివిజన్‌గా ఉంచేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించామన్నారు. జీవీపీ పాయింట్స్ గుర్తించి స్పాట్ వాహనాల ద్వారా తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. విజయవంతం కావడానికి ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో డీఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది దాస్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోషి, బాలామణి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం



జవహర్‌నగర్‌లో సీపీఐ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్

జవహర్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎన్నో పోరాటాలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ దళితభవన్‌లో బుధవారం కాప్రా సీపీఐ కార్యదర్శి కామ్రేడ్ దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి పార్టీ సభ్యులకు కొత్త కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిందని, పథకాలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన నిలదీస్తామన్నారు. రాబోయే రోజుల్లో సీపీఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. పార్టీ సానుభూతిపరులు అందరూ పార్టీ నూతన సభ్యత్వం స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, రాజేశ్వరి, శ్యామల, లత, స్వరూప, ఎల్లయ్య, మహేష్, మాధవి, అశోక్‌చారి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

జవహర్‌నగర్ మేయర్ కావ్య



వారియర్స్ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహభావం పెంపొందుతుందని మేయర్ కావ్య అన్నారు. జవహర్‌నగర్‌లో నిర్వహించిన యూత్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతలైన వారియర్స్ టీమ్‌కు మేయర్ కావ్య, కార్పొరేటర్ శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా రూ.25 వేల నగదు ప్రైజ్, ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా రన్నర్స్ లగాన్ ఎలెవన్ టీమ్‌కు రూ.15 వేల క్యాష్ ప్రైజ్, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కార్తీక్‌రెడ్డి, నరేందర్‌యాదవ్, ప్రణీత్, మణి, నాయకులు మెట్టు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.